# చదువుకంటె గుణము గొప్పది

**గుణము కొంచెముండి గొప్ప చదువులున్న**
**ఫలమదేమి చదువ విలువదేమి**
**పంట పండని భూమి పదిఎకరములేల**
**కొంచెమైన చాలు మంచిభూమి.**

విద్యార్థులారా!

ఈనాటి విద్యార్థులు కేవలము భౌతికమైన, ప్రాకృతమైన విద్యలందు శ్రద్ధాసక్తులను కనపరుస్తున్నారు గానీ, మానసిక సంబంధమైన, అంతర్భావ సంబంధమైన ఆత్మవిద్యలందు కృషి చేయటంలేదు.

**మేఘములు మింటిపై చేరి మసలుచుండ**
**వాటి దాపున విద్యుత్తు వరలునట్లు**
**విద్యవెనుకను జ్ఞానంబు వెలయవలయు**

ఈనాటి విద్యలయందు ఒకవైపున ప్రాకృతిక సంబంధమైన వాంఛలచేత, ప్రాంతీయ దురభిమానముల చేత, కులమతము సంబంధముచేత మానవత్వమునే కోల్పోయి, విద్యావికాసము మరచిపోయి, గ్రంధపరిచయము మాత్రమే గావించుకుంటున్నారు విద్యార్థులు. ఈనాటి విద్య ధన ఆర్జన నిమిత్తమై అభ్యసిస్తున్నారు; కాని, గుణ ఆర్జన నిమిత్తమై విద్య నభ్యసించటం లేదు. విద్య చెడ్డదికాదు. ధనము కూడ చెడ్డదికాదు. మానవుని గుణమే దీనికి మూలకారణము. సత్సంకల్పములచేత మానవుని హృదయము నింపుకున్నప్పుడు ఈ ధనము, విద్య సద్వినియోగ పడతాయి. దుర్గుణములచేత, దురాలోచనలచేత, దుర్భావములచేత హృదయాన్ని నింపుకున్నప్పుడు ఈ విద్యాధనములు రెండు దుర్వినియోగమవుతాయి.

**మానవునియందు గుణము లేనప్పుడు విద్య, ధనము రెండూ వ్యర్థమైపోతాయి**

srisathyasaivachanamrutam

సద్వినియోగ, దుర్వినియోగములకు ముఖ్యకారణం మానవుని మనస్సేకాని విద్య, ధనములు కాదు. దీనికి చక్కని ఉపమానము. తెల్లని నీటిని ఎఱ్ఱని సీసాలో పోసినప్పుడు ఆ నీరు ఎఱ్ఱగా మారుతుంది. అదే పరిశుద్ధమైన నీరు నీలంరంగు సీసాలో పోసినప్పుడు ఆ జలమే నీలం రంగుగా మారుతుంది. అదేవిధముగా మానవుడు అభ్యసించిన విద్యకాని, ఆర్జించిన ధనముగానీ పరిశుద్ధమైన బాటిల్‌లో వేసినప్పుడు పరిశుద్ధముగానే కనిపిస్తాయి. రజోగుణ సంబంధమైన ఎఱ్ఱని బాటిల్‌లో పోసినప్పుడు ఇది ఎఱ్ఱగా కనిపిస్తాయి. ఇది మానవదేహమనే బాటిల్‌లో పోసినప్పుడు ఈ మానవదేహములో హృదయ పరివర్తన ఏవిధంగా ఉంటుందో దాని గుణములు పొందుతుంది. ఈ విద్యాధనములు రెండు కూడ రజోగుణ సంబంధమైన వ్యక్తియందు చేరినప్పుడు రజోగుణ సంబంధమైన ప్రవర్తనను ఈ రెండు అనుభవిస్తాయి. సాత్వికగుణమనే హృదయంలో ప్రవేశించినప్పుడు ఈ విద్యాధనములు సాత్వికంగా ఉంటాయి. కనుక మానవుని గుణములే దీనికి మూలాధారము కాని ధనవిద్యల మంచి చెడ్డలు ఏమాత్రము కాదు. మానవునిలో ఎన్ని శక్తులుండినప్పటికిని గుణము అనే ప్రధానమైన శక్తి లేకపోయినప్పుడు ఈ విద్యాధనములు రెండు వ్యర్థమైపోతాయి.

**ప్రాచీనకాలమునుండి భారతదేశము శీలసంపత్తికే అధికగౌరవమునిస్తూ వచ్చింది**

శివాజీకి విద్య తక్కువ, గుణము ఎక్కువ. దేహసంబంధమైన ధైర్యసాహసములు కూడా చాలా తక్కువ. నైతిక ధార్మిక గుణములు అధికంగా ఉండేవి. కనుక శివాజి ధర్మమార్గములో ప్రవేశించి, దేశములో ధర్మాన్ని స్థాపించాలని ప్రయత్నించి, సమాజమును పవిత్ర మార్గములో ప్రవేశింపచేయాలని సంకల్పించి పరిస్థితులు ప్రారంభమైనప్పుడు యుద్ధమందు ప్రవేశించాడు. ఆ గుణము యొక్క ప్రభావమే, ఆ యుద్ధములో శత్రువులు పరాజయం పొందినప్పుడు వారి స్త్రీలను కన్నెత్తి అయినా చూడక వారి బంధువులకు అప్పగించి వారిని సంరక్షిస్తూ వచ్చాడు శివాజి. అయితే, అతని కుమారునికి శౌర్యపరాక్రమములు అధికంగా ఉండేవి. కాని, గుణము తక్కువగా ఉండేది. కనుకనే శివాజివలె, శివాజీ కుమారుడు శంభుడు, కీర్తిప్రతిష్ఠలు నిలుపుకోలేకపోయాడు. కనుక, ప్రాచీన కాలమునుండి మన భారతదేశము శీల సంపత్తికే ప్రధానగౌరవము అందిస్తూ వచ్చింది. విదురుడు కూడ ఈ గుణములచేతనే పేరు ప్రఖ్యాతులు

srisathyasaivaahini

ఆర్జిస్తూ వచ్చాడు. అన్యాయ, అక్రమ, అనాచారములేమాత్రము తాను అంగీకరించేవాడు కాదు. ధృతరాష్ట్రునకు ఎన్నివిధములుగానో బోధచేస్తూ వచ్చాడు. ఇట్టి దుర్మార్గులైన కుమారులుండే కంటే పోతే బాగుండునని ధృతరాష్ట్రునకు బోధ చేశాడు. నూరుమంది పుత్రులున్న ధృతరాష్ట్రుడు ఏ సుఖములు అనుభవించాడు? ఏ పుత్రులు లేని సద్గుణవంతుడైన శుకుడు ఏ దుర్గతులు పొందాడు? కనుక, గుణములు వెలిగించే ఒక్క పుత్రుడైనా చాలు. గుణములేని పుత్రులెంతమంది ఉండినప్పటికి ఏమి ప్రయోజనము అని అనేకవిధములుగా బోధ చేశాడు. ద్రౌపదిని నిండుసభలో పరాభవం జరిపిన సమయంలో మహాజ్ఞాని అయిన భీష్ముడు, ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు అందరూ ఆచార్యులే ఉన్నారు. ఆమె ఒక్కటే ఒక ప్రశ్న అడిగింది: "పితామహులారా! పెద్దలారా! గౌరవనీయులైన సభ్యులారా! ధర్మజుడు నన్నోడి తానోడెనా? తానోడి నన్నోడెనా? తాను ఓడిన తరువాత నన్ను ఓడిపోయే అధికారం అతనికి లేదు. అంతేకాక, నాకు ఐదుగురు భర్తలున్నారు. అందులో ఒక్క భర్తమాత్రమే ఓడితే ఇది న్యాయమవుతుందా? ఐదుమంది అంగీకరించాలి కదా. ఇది న్యాయమైన మార్గమా?" అని ప్రశ్నించింది. ఒక్కరూ పలకలేదు. ఆ మౌనము చూచిన విదురుడు "ఛీ! ఈ హస్తినాపురములో ఉండేకంటే అడవులలో కాలం గడుపుకోటం మేల"ని ఆనాడే హస్తినాపురము వదిలాడు. అట్టి పవిత్రమైన గుణశీలురైన వ్యక్తులు ప్రాచీన కాలమునుండి భారతదేశములో మాణిక్యముల వలె మెరుస్తూ వచ్చారు. వారు సమాజసేవకై జీవితమంతా అంకితము గావించుకుంటూ వచ్చారు. పైగా అవసరమైనప్పుడు గురువాజ్ఞను కూడా ధిక్కరించి తమను భగవంతునికి అర్పితము గావిస్తూ వచ్చారు.

లోకములో తల్లి, తండ్రి, గురువు, దైవము ఈ నల్గురు పూజనీయులే. కానీ దైవాజ్ఞకు విరుద్ధముగా ప్రవర్తించినప్పుడు వీరు తల్లినైనా సరే త్యజించారు, తండ్రినైనా త్యజించారు, గురువాజ్ఞను కూడా ఉల్లంఘించారు. దైవానికి అర్పితమైపోయారు. "శ్రీరాముని అడవులకు పంపిన తల్లికైక నిర్మలమైన, నిశ్చలమైన, నిస్వార్థమైన శ్రీరామచంద్రుని అడవికి పంపటమా? అట్టి దయాదాక్షిణ్యమూర్తి, ధర్మమూర్తిని నిష్కారణముగా అడవికి పంపటమా, ఎంత క్రూరత్వము. రాముడు చేసిన దోషము ఏమిటి? ఎట్టి దోషరహితుడైన శ్రీరామచంద్రుని అడవులకు పంపిన యీ తల్లి ముఖమే చూడకూడద"ని, తాను అరణ్యమునకు పోవటానికి సిద్ధమయ్యాడు భరతుడు.

srisathyasaivachanamrutam

ప్రాకృతమైనదానికోసం కాదు. స్వార్థ స్వప్రయోజనం కోసం కాదు. దైవంకోసం ఈ విధమైన త్యాగము చేశాడు. రాముడు సాక్షాత్తు నారాయణమూర్తి. ధర్మమూర్తి, కనుక తాను పితృవాక్య పరిపాలన నిమిత్తమై అరణ్యమునకు వెళ్లాడు. అప్పుడు తల్లి ఆజ్ఞను కూడా మీరాడు భరతుడు.

ఇంక ప్రహ్లాదుడు. ఎన్నివిధముల హరినామము విడువమని బోధించినప్పటికి 'దేనినైనా విడుస్తాను కాని హరినామాన్ని నేను విడువను' అన్నాడు. 'నా ప్రాణమునైనా విడుస్తానుగానీ హరి నామాన్ని వదలన'న్నాడు. తల్లి వచ్చింది. బాధను సహించుకోలేక కుమారుని చేతులు పట్టుకుంది.

**ఏల ఇటుల తనయా వలదు**
**హరి హరి యనబోకుమురా**
**ఏమి హరియో ఇటు పలుక**
**ఎవరు నేర్పినారురా నీకు**

అని వాపోయింది. కాని ప్రహ్లాదుడు మాత్రం 'తల్లితండ్రులనైనా వదులుతాను గానీ నేను హరిని మాత్రము వీడను', అని పట్టుపట్టి ఎన్ని కష్టములకైనా, ఎన్ని దుఃఖములనైనా, ఎన్ని ప్రమాదములనైనా తాను ఎదుర్కొని హరి నామాన్ని స్మరిస్తూ వచ్చాడు. ఎలాంటి పరిస్థితిలోనైనా తల్లి తండ్రుల మాటవినలేదు. తండ్రి ఆజ్ఞమీరి దైవం కోసం వచ్చాడు. కారణం ఏమిటి? హరిప్రియుడు ప్రహ్లాదుడు. హరి ద్వేషి హిరణ్యకశిపుడు. కనుక తండ్రినైనా త్యజించాడు ప్రహ్లాదుడు.

ఇంక గురువు శుక్రాచార్యుడు బలి చక్రవర్తి దగ్గర చేరాడు. 'మహాప్రభూ! వచ్చినవాడు సామాన్యుడు కాదు. కేవలం మూడు అడుగుల ఎత్తు మాత్రమే ఉన్నాడు కానీ ముల్లోకములను వశము చేసుకోగలడు. నీవు ఇతనిని సామాన్య బ్రాహ్మణుడని విశ్వసించకు. ఇతను మహావిష్ణు స్వరూపము. అతడు నీ దగ్గరకొచ్చి చేయి చాపుతున్నాడు. అంతమాత్రముచేత నీవు మరచిపోయి నీ పదవిని మరచిపోయి అతనికి లొంగిపోవద్దు', అని చక్రవర్తికి బోధించాడు. "ఆహా! ఎంతటి మహావాక్యము విన్నాను నేను. శ్రీమన్నారాయణుడే వచ్చి నాయనా! నాకు ఇవ్వమని చేయి చాచి అడుగుతుంటే ఇంతకన్న మహాభాగ్యం ఏముంది? అడుగుతున్నవాడు భగవంతుడు.

sri sathyasai vachanamrutam

ఎవరిని అడుగుతాడు? బ్రహ్మాండమంతా తన చేతిలో ఉన్నవాడు అడగటానికి వచ్చాడంటే నేనెంత అదృష్టవంతుడను."

**బ్రహ్మాండమంతట ప్రబలుచుండెడి తనకు**
**ఆలయమమర్చ అలవియగున**
**సర్వజలంబుల సంచరించెడి తనకు**
**స్నానంబు చేయింప సాధ్యమగున**
**బ్రహ్మాండమంతయు బొజ్జలో నుండగ**
**భక్ష్యభోజ్యములతనికి పెట్టతగున**

"అలాంటి భగవంతుడే వచ్చి ఇవ్వమని నాదగ్గర చేయి చాపుతుంటే ఇచ్చే నా చేయిపైన ఉంటుంది. అడిగేవాని చేయి క్రింద ఉంటుంది. ఇంతకంటె మహా భాగ్యమా? ఇదే నా అదృష్టము. ఏమైనా నేను ఇస్తాను", అన్నాడు. గురువు ఆజ్ఞను కూడా ధిక్కరించి భగవంతునికి అడిగినదానిని అర్పితము చేశాడు. ఎవరైనా దానం చేస్తే భూదానం చేయవచ్చు, గోదానం చేయవచ్చు, వస్త్రదానం చేయవచ్చు, సువర్ణదానం చేయవచ్చు, అన్నదానం చేయవచ్చు, విద్యాదానం చేయవచ్చు, కానీ బలిచక్రవర్తి తనను తానే దానం చేసుకున్నాడు. ఈ ముగ్గురు దేనికోసం చేశారు? ముగ్గురు స్వార్థ స్వప్రయోజనాలకోసం కాదు, దైవం కోసమే చేశారు. తల్లి ఆజ్ఞ మీరటం భరతుడు దైవంకోసమే, రామచంద్రుని కోసమే. ప్రహ్లాదుడు తండ్రి ఆజ్ఞమీరటం దైవంకోసమే. తన కోసం కాదు, దైవం కావాలి. ప్రాచీన కాలమునుండి భారతదేశములో ఇలాంటి త్యాగమూర్తులు, ధర్మమూర్తులు ఎన్నో విధములుగా ఆదర్శము నందిస్తూవచ్చారు.

**త్యాగమునకు, దానమునకు ఎంతో వ్యత్యాసముంది**

దానమునకు, త్యాగమునకు ఎంతో వ్యత్యాసముంది. కానీ ఈనాటి ప్రజలు దానమును, త్యాగమును రెండింటిని సమానంగా భావిస్తున్నారు. ఇది చాలా పొరపాటు. ఏదో తనకున్న దానిలో పరులకు కొంత దానము చేయవచ్చు. తనకున్న దానిలో దానము చేయవచ్చును. తాను కొంత స్వార్థముగా పెట్టుకొని పరులకు కొంత అందించవచ్చు. ఇందులో స్వార్థం, స్వప్రయోజనము కొంత ఉంటున్నాయి. త్యాగమంటే అది కాదు. తనకేది ఇష్టమో తనకేది

ప్రీతికరమో దానిని ఇతరులకందించటం త్యాగము. అన్నింటికంటె మానవుడు దేనిని ఎక్కువగా అభిలషిస్తాడు. తన ప్రాణమునే అభిలషిస్తాడు. తన ప్రాణముకంటె అధికమైనది మరొకటి లేదు. కానీ త్యాగమంటే ప్రాణములైనా అర్పించటమే. తనకిష్టమైన దానిని ఇతరుల కందించటమే త్యాగము. తనకు ప్రీతికరమైన వస్తువులు ఇతరుల కందించటమే త్యాగము. కనుక త్యాగమునకు, దానమునకు ఎంతో వ్యత్యాసముంది. నేను త్యాగం చేశానయ్యా అంటూ ఫలాని భూమి ఇతరుల కందించానంటారు. కాని, అది త్యాగము కాదు; పేరు ప్రతిష్ఠలకోసం చేసేది. త్యాగము అమృతమయమైనది. ఎట్టి మార్పులు లేనిది. దానికంటె మించినది మరొకటి లేదు.

**త్యాగము అమృతమయమైనది**

నీవు అమృతపుత్రుడవు. నీ దేహము అమృతమైనది. ఇది క్షీణించేది కాదు. కేవలం రాలిపోయేది, కూలిపోయేది, కాలిపోయేది. కానీ ఆత్మ కాలేది కాదు. కూలేది కాదు. మారేది కాదు. ఎప్పటికీ ఒక్కటే! అట్టి నిత్యసత్యమైన ఆత్మస్వరూపమే ఈ అమృత స్వరూపము. కనుక, త్యాగము అమృతమయమైనది. అలాంటి త్యాగమూర్తులు భారతదేశంలో ప్రాచీన కాలమునుండి నేటివరకుకూడా వస్తున్నారు. ఈ భారతదేశములో అవతార మూర్తులు అవతరిస్తూ, అనేకమంది మహనీయులవతరిస్తూ అనేక ప్రబోధలు సల్పుతూ వచ్చారు. బలిచక్రవర్తియే కాదు. శిబిచక్రవర్తి, దధీచి ఎంతో త్యాగము చేస్తూ వచ్చారు. శిబిచక్రవర్తి దగ్గరకు ఒక డేగ ఒక పావురమును తరుముతూ వచ్చింది. ఆ పావురము శిబిచక్రవర్తి ఒడిలో పడింది. 'రాజా! నన్ను రక్షించు రక్షించు', అని వేడుకొంది. శిబి చక్రవర్తి త్యాగమును పరీక్షించుటకు ఇంద్రుడు ఆడిన నాటకం ఇదంతా! పావురమును రక్షిస్తానని అభయమిచ్చాడు. డేగ వచ్చింది. 'రాజా! నేను తరుముతున్న పక్షిని నీవు దాచుకుందుకు ఎలా వీలవుతుంది? నేను తరుముకు రావటంవలన కదా ఈ పక్షి నీదగ్గరకు వచ్చింది. కాబట్టి ఈ పావురము నాది. నీవు రాజువు. ధర్మాన్ని అనుసరించు. నీవు నీ రాజరికమును పాలించు' అని చెప్పింది. కాని శిబిచక్రవర్తి 'నాకు తెలుసు. నన్ను శరణు జొచ్చిన పక్షిని రక్షించుట నా కర్తవ్యము అన్నాడు. అది ఎవరి ఆహారమో, ఎవరి తిండో ఎవరి పావురమో నాకు అక్కరలేదు. నన్ను శరణు జొచ్చిన వానిని రక్షించటము నా కర్తవ్యము. ఎవరైతే నాకేమి? దీనికి నేను అభయ మిచ్చాను. నామాట తప్పటానికి వీలుకాదు. ఈ పావురము

sri sathyasai vachanamrutam

బరువు ఎంతో నా కండను కోసి నీకిస్తాను తీసుకో'మన్నాడు. కేవలము పరీక్ష నిమిత్తమై జరిగినది. త్రాసు తెచ్చాడు శరీరములోని అవయవములను కోసి వేస్తూ వచ్చాడు. కానీ పక్షి తూగలేదు. అన్ని కండరములు కోశాడు. ఒక పావురమును రక్షించే నిమిత్తము తన దేహమును కూడా త్యాగము చేస్తూ వచ్చాడు శిబిచక్రవర్తి. కడపటికి తన శిరస్సు ఖండించుకోటానికి లేచినప్పుడు ఇంద్రుడు ప్రత్యక్షమయ్యాడు. నిన్ను పరీక్షించే నిమిత్తమై ఆడిన నాటకమిది. ఇది పావురము కాదు. నేను డేగ కాదు. నేను ఇంద్రుడను. నీ త్యాగమునకు మెచ్చుకున్నాను. ప్రాణమునకు మించిన త్యాగముందా? దేహమే త్యాగము చేస్తానని చెప్పటం చేత ఇంద్రుడు ప్రసన్నుడయ్యాడు. శిబిచక్రవర్తి మానవతకు విలువ నందిస్తూ వచ్చాడు. ఇలాంటి త్యాగులు భారతదేశములో పెక్కులు గలరు.

**భగవంతుడు ఏది చేసినా పరోపకారముకొరకే**

వామనుడు మూడు అడుగులు అడిగాడు, బలి చక్రవర్తిని. ఒక అడుగుతో భూమినంతా ఆక్రమించాడు. రెండవ అడుగుతో ఆకాశమునంతా ఆక్రమించాడు. మూడవ అడుగునకు స్థానమే లేదు. 'ఇంకో అడుగునకు స్థానమెక్కడ?' అని అడిగాడు వామనుడు. తన తల చూపించాడు, బలి. తన తలపైన మూడవ అడుగు పెట్టమన్నాడు. అప్పుడే దేవతలందరిలో భీతి బయలుదేరింది. "అయ్యో, నారాయణుడు ఎంతటి కఠినుడు!" అనుకున్నారు.

**మేనమామయని ఇంచుకైన లోనెంచక**
**కంస భూపాలుని హింస చేసె**
**స్త్రీ బాల యని చింత ఇంతయు లేక**
**తాటకి గాత్రంబు తరిగివేసె**
**భిక్షమడిగిన లేదనకిచ్చె బలియు**
**అతనిని పాతాళమునకు అణగద్రొక్కె**
**ఇట్టి దయ లేని హరిని ఏమందు భువిని?**

అనుకున్నారు. ఇది పరీక్ష నిమిత్తమై జరిగేది. ఈ పరీక్షలోకూడా కొన్ని కష్టములు ఉద్భవించాలి. కడుపులో ఎపెండిసైటిస్ అనే నొప్పి వచ్చింది. ఈ వచ్చిన నొప్పి పోవాలంటే డాక్టరు పెట్టిన

sri sathyasai vachanamrutam

నొప్పి భరించాలి. డాక్టరు కత్తితో కోశాడు. డాక్టరు నిర్దయుడా? కాదు. కాదు. దయచేతనే చేశాడు. కోస్తే కాని నొప్పిపోదు. పుట్టిన నొప్పి పెట్టిన నొప్పితో నివారణ గావించుకోవాలి. ఈ మానవులు కర్మానుసారంగా అనుభవించే దీనికి భగవంతుడు పెట్టే పరీక్షలు కొంతవరకు సహాయము చేస్తాయి. భగవంతుడు ఏమి చేసినా ఉపకారమేగానీ అపకారము కాదు. కారణము ఏమిటి? భగవంతుడు నిస్వార్థపరుడు. అతనికి స్వార్థము, స్వప్రయోజనము తెలియదు. తెలియనప్పుడు ఉన్నదని చెప్పటానికి ఎలా వీలవుతుంది? స్వార్థ స్వప్రయోజనములతో చేస్తాడని భక్తులు భావిస్తారు. అది వారి భ్రమ. ఈ భ్రమ ఉండినంతవరకు బ్రహ్మభావము గుర్తించటానికి వీలుకాదు. భ్రమపోతేగానీ బ్రహ్మభావము రాలేదు. భ్రమ ఉంటున్నది హృదయములో. ఆ హృదయము single sofa. భ్రమను సింహాసనమునుండి తీసేస్తే బ్రహ్మ పోయి దానిలో కూర్చుంటాడు. భ్రమను, బ్రహ్మను ఇద్దరినీ ఒకే సింహాసనముపై కూర్చోబెట్టుటకు వీలుకాదు. కలిప్రభావముతో ఇద్దరినీ ఒకే సింహాసనముపై కూర్చోపెట్టటానికి చూస్తున్నారు. మీరు కూర్చోపెట్టుటకు ప్రయత్నించినా బ్రహ్మ రాడు. ఎందుకనగా భ్రమ ఉందక్కడ. భ్రమ ఆ ఛైర్‌పై కూర్చున్నప్పుడు ఆ ఛైర్ భ్రమదే. ఇంకొకరి ఛైర్‌లో ఎలా కూర్చునేది? భ్రమ లేచిపోతేనే గానీ బ్రహ్మ కూర్చోడు. ఇది కూడా బ్రహ్మజ్ఞానములో ఒక న్యాయమే. ఈవిధముగా పరమాత్ముడు విచారణ చేస్తుంటాడు.

**సమాజ క్షేమము నిమిత్తమై ఏవిధమైన త్యాగమునకైనా సిద్ధంగా ఉండాలి**

చదువులు ఎక్కువ లేకపోయినా గుణము ఉండాలి. గుణము ఎక్కువ ఉండి చదువు తక్కువ ఉండినా ఫరవాలేదు. పంట పండని భూమి పది ఎకరములు ఏల? పది గజముల మంచి స్థలము ఉంటే చాలు. మంచి గుణము ఒక్కటి ఉండినా చాలు. ఏమిటి ఈ మంచి గుణము? దైవమునకు ప్రీతికరమైనదే మంచి గుణము. దీనినే లోకమంతా మెచ్చుకుంటుంది. లోకమంతా 'ఇతను దైవస్వరూపుడురా! దైవముయొక్క గుణముతో ఉంటున్నాడురా!' అంటారు. దైవాజ్ఞ ప్రకారం నామస్మరణ చేస్తూ, అనేకమందికి సహాయము చేస్తూ సత్కర్మలలో ప్రవేశిస్తుంటే అట్టివానిని దైవ సమానుడంటారు. త్యాగము దైవ స్వరూపమే. అట్టి త్యాగమునకు మనం పూనుకోవాలి. ఎట్టి త్యాగము? స్వార్థ రహితమైన త్యాగము. సమాజక్షేమము నిమిత్తమై మనము

sri sathyasai vahini/vachanamrutam

ఏవిధమైన త్యాగమునకైనా సిద్ధంగా ఉండాలి. మనము చదివిన చదువులు సమాజమునకు ఉపయోగము లేకపోతే మన చదువు లెందుకోసం? రావణుడు ఎన్నో చదువులు చదివాడు. రావణుని విద్యలు అజీర్ణముగా మారినాయి. కారణం ఏమిటి? ఆచరణలో పెట్టలేదు. అందులో అర్ధము విద్యలే చదివాడు రాముడు. ఆ విద్యలను ఆచరణలో పెడుతూ వచ్చాడు. ఆరోగ్యము పొందాడు. ఏమిటా ఆరోగ్యము? అదే ఐశ్వర్యం, కీర్తి మర్యాదలు, ఆదర్శ జీవితము. సమాజము నిమిత్తమై రాముడు తన సర్వశక్తులు ధారపోస్తూ వచ్చాడు. రావణుడు తన సర్వవిద్యలు స్వార్థము కోసం వినియోగించాడు. ఇది పరార్థము, అది స్వార్థము. పరార్థము యదార్థము. స్వార్థము అనర్ధము. అనర్ధమునకు కారణమైంది రావణుని చదువు. యదార్థమునకు స్థాన మిచ్చింది రాముని చదువు. ఆనాటి మొదలు నేటివరకు రామకీర్తి దేదీప్యమానముగా ప్రకాశిస్తున్నాది. ఇన్ని వేల సంవత్సరములు రామాయణము ఇంత సజీవంగా ఉన్నదంటే పవిత్రతను గుర్తించాలి. కేవలము చరిత్రలందు మాత్రమే పవిత్రమైంది కాదు. అందరి హృదయములను పవిత్రము గావిస్తూ వచ్చింది. ఏమిటి History? His story is history. అదే రాముని చరిత్ర.

విద్యావంతులు ఆ విద్యను సమాజమున కుపయోగపెట్టి సమాజములో వారిని సరైన మార్గములో పెట్టటానికి ప్రయత్నించాలి. లోకమునకు హితమయ్యేదానిలో మనం విద్యలు ప్రవేశపెట్టాలి. విద్య విజ్ఞానమైనదిగా ఉంటుండాలి. సద్గుణములు విద్యలో ఆవిర్భవించాలి. ఇదే ప్రధానమైనది. లోకహితమును మనం ఆశించాలి. ఇదే ప్రధానమైనది. మంచి గుణములు మనలో పెరగాలి. ఇలాంటివి లేకపోతే చదువులు చదివి ఏమి ప్రయోజనము? చదువులు చదవవలసిందే. జీవనోపాధికి ఉద్యోగము చేయవలసిందే. పరోపకారములో చదువును ఉపయోగపెట్టాలి. చదువుకంటె గుణము గొప్పది. ఈనాటి చదువులను ధనమునకు అమ్ముకుంటున్నాము. వ్యాపారరంగముగా బయలుదేరింది. విద్య అమ్ముకొనేది కాదు, అడుక్కొనేది కాదు. విద్య పంచుకొనేది. ఒకరికొకరు పంచుకొనేది. పంచుకొనుటలో దానంతట అదే అభివృద్ధి అవుతుంది.

**ఎవరి కర్తవ్యమును వారు సక్రమంగా నిర్వర్తించాలి**



sri sathyasaivahanamrutam

విద్యార్థులారా! మీరు విద్యను అభ్యసించిన తరువాత ఉద్యోగము చేసుకోటంలో తప్పులేదు. కానీ ఉద్యోగముతో బాటు సమాజముయొక్క సుక్షేమమును మనం ఆశించాలి. సమాజము యొక్క సంక్షేమము మనం దృష్టిలో ఉంచుకోవాలి. సమాజసేవలో పాల్గొనాలి. ఈ సమాజ సేవలో పాల్గొనటం అంటే ఏమిటి? "చదువుకున్నాను, సఫారీ డ్రస్సు వేసుకున్నాను, తెల్లని దుస్తులు వేసుకున్నాను, బజార్లు ఊడ్చటమా. ఇది సేవకాదు" అనుకొని విసుగుపడకూడదు. బజార్లు ఊడ్చటము సేవకాదు. నీవు ఉద్యోగము చేస్తున్నావు. ఉద్యోగము సక్రమముగా ఆత్మతృప్తిగా చేయి; అదే సేవ. నీవు వ్యాపారము చేస్తున్నావు. అన్యాయ అక్రమ మార్గములో కాక సక్రమముగా నీ వ్యాపారము చేయాలి. ఇంతేకాదు. ఈనాడు భారతదేశము ఈ దుస్థితికి రావటానికి మూలకారణమేది? ఎవరి డ్యూటీ వారు సరిగా చేయటంలేదు. ఇలాంటివారికి భక్తి ఉండి ఏమి ప్రయోజనము? డాక్టర్సుగానీ, నర్సులుగానీ తమ తమ కర్తవ్యములను చక్కగా నిర్వర్తించాలి. పేషెంటు అక్కడ బాధ పడుతుంటే హారతి అవుతున్నదని పరుగెత్తిరావటం, ఇది భక్తి కాదు, పిచ్చి! ఆ పేషెంటును చక్కగా చూచుకో. ఆ పేషెంటుకు ఎట్టి బాధలూ రాకుండా చూచుకో. అదియే నీయొక్క సేవ. కర్తవ్యము. అక్కడ విడిచిపెట్టి హారతి ఇస్తున్నారని పరుగెత్తి వస్తే భక్తి అవుతుందా? ఇది భక్తి కాదు, మూర్ఖత్వము! అలాంటివారికి ఎంత విన్నా భక్తి కుదరదు. పది చిల్లుల పాత్రలోకి పాయసం పోస్తే అంతా కారిపోతూనే ఉంటుంది. ఎప్పుడూ ఖాళీయే! నీ హృదయమునకు స్వార్థము, స్వప్రయోజనము అనే చిల్లులు పడినప్పుడు అందులో ఎంత భక్తి కూరినా ఏమి ప్రయోజనము? ఎవరి కర్తవ్యమును వారు సక్రమంగా చేయాలి.

చాలా ప్రధానమైనది ఇంకొకటి ఉంటున్నది. ఎంత మనము జీతము తీసుకుంటున్నామో ఆ జీతమునకు తగినంత పని మనం చేయాలి. అప్పుడే మనము దేశసేవ చేసినవారమవుతాము. జీతము ఎక్కువ తీసుకొని పని తక్కువ చేస్తే, దేశాన్ని మోసము చేసినట్లవుతుంది. ఇచ్చిన జీతమునకు తగిన పని చేస్తున్నావా లేదా? చేస్తే అదే గొప్పసేవ. ఇలాంటి సద్గుణములచేత మనం సేవ చేయాలి. నిజముగా ప్రతి ఒక్కరూ జీతమునకు తగిన పని చేస్తే మన భారత దేశము ఈ గతికి ఎందుకు వస్తుంది? జీతములిచ్చేకోసమని ప్రతి దేశమునకు పోయి అప్పులు అడుగుతున్నారు. ఎవరికోసం అప్పు తీసుకుంటున్నారు? మీ కోసమే! జీతమునకు తగిన పని చేస్తే నష్టములే ఉండవు కదా! వేల రూపాయలు జీతము తీసుకునేది నయాపైసల పని చేసేది.

న్యాయమా? ఇది న్యాయమే కాదు. ధర్మమే కాదు? త్యాగము కాదు. పుచ్చుకున్న దానికి తగిన పని చేయాలి. అదే త్యాగము. ఆత్మకు తృప్తిగా ఉండాలి. అదే మనకు తగిన శాంతి. లేకపోతే శాంతి ఎక్కడనుండి వస్తుంది? శాంతి, శాంతి, శాంతి అంటాము. ఏమిటా శాంతి? ఆధిభౌతికము, ఆధిదైవికము, ఆధ్యాత్మికము. మూడింటి యందు శాంతి రావాలి. అందుచేతనే మూడు పర్యాయములు శాంతి చెప్పటము దేహరీతిగా శాంతి రావాలి. మనస్సు రీతిగా శాంతి రావాలి. ఆత్మరీతిగా శాంతి రావాలి. ఆధ్యాత్మికముగా మన ప్రాచీన సంస్కృతియందు ఇంత నిగూఢమైన అంతరార్థములు ప్రబోధించింది.

**అర్థము తెలియకుండా వేదమును ఉచ్చరించుట వ్యర్థము**

భారతీయ సంస్కృతి యందున్న పవిత్రత ఏ దేశమునందు లేదు. ఆ దివ్యత్వము ఒక్క భారతీయ సంస్కృతి యందే ఉంటున్నది. పిల్లలు ప్రార్థనలో చెప్పారు, 'సహనావవతు సహనౌభునక్తు. సహవీర్యం కరవావహై' అని. మొట్టమొదట వేదము ప్రబోధించినది ఇదే! అందరము కలసిమెలసి ఉందాం. అందరు ఒక తల్లిబిడ్డలుగా ఉందాం. మనం కలసిమెలసి చేసిన పనిలో అందరము సమంగా భాగము వహిస్తాము. నీకు ఎంతనో నాకు అంతనే. కష్టము కాని సుఖముకాని పంచుకుందాం అని వేదము మొట్టమొదట ప్రబోధించింది. ఈనాడు వేదము ప్రబోధించే పండితులు సక్రమమైన మార్గమును ఉచ్చరించక వారికి తోచినది ఉచ్చరించి యదార్థము మూసిపెడుతూ వచ్చారు. అది వారి దోషముకాదు. వారికి తెలియదు. వేదము ఉచ్చరిస్తున్నారేగానీ వేదార్థము వారికి తెలియదు. అర్థము తెలియకుండా వేదము ఉచ్చరించటము వ్యర్థము. అర్థము తెలియనప్పుడు ఏమి ప్రయోజనము? మీకందరికి తెలుసు. మద్రాసులో గాన కోకిల ఉండేది. ఆమె కంఠం ఎత్తితే కోకిలవలె ఉండేది. ఆమె పేరే గానకోకిల. ఆమెకు త్యాగరాజు కీర్తనలు ఇష్టము. అయితే తెలుగు తెలియదు. త్యాగరాజు కీర్తనలన్నీ తెలుగులో ఉంటాయి. త్యాగరాజు పాడాడు. 'నే పొగడకుంటే నీకేమి కొదువ రామా!' అని. నేను పొగడకుంటే నీకేమి తక్కువ రామా, అని అర్థము. ఆమె సుస్వరముతోనే నే పకోడా తింటే నీకేమి కొదువ రామా!' అని పాడింది. పొగడకుంటె, పకోడాతింటే, రెండింటికి ఎంత వ్యత్యాసము చెప్పండి! తమిళములో గకారము, తకారము లేదు. ఉకారము, దకారము భేదము

sri sathyasai vahini amrutam

లేదు. పొగడకుంటే అనటానికి పకోడాతింటే అంటారు. సంగీతములో శ్రవణానందముగా ఉంటుంది గానీ అర్థములో ఘోరముగా ఉంటుంది. వేదము చెప్పటానికి ఖంగుమని చెప్పవచ్చుగానీ అర్థము తెలియనప్పుడు అంతా శ్రవణానందమే. మననానందము లేదు. మననానందము రావాలి. ఈ విధమైన పవిత్రత గుర్తించటానికి ప్రయత్నించాలి. నేటి విద్యార్థులు భావిభారతోద్ధారకులు. చిన్న విషయాలు కూడా ఆధ్యాత్మిక రంగములో అర్థము తెలిసి మనం ప్రవర్తించాలి.

1996 జూన్ 29వ తేది సాయికుల్వంత్‌హాల్‌లో భగవాన్ దివ్యోపన్యాసం

sri sathyasai vachanamrutam